క్లుప్తంగా

అనుమతి తీసుకోవాలి

సూర్యాపేట అర్బన్ : మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసే టపాసుల షాపులకు విధిగా ఎన్ఓసీ, ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీఎచ్.హనుమంత రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి సందర్భంగా పట్టణంలో టపాసుల షాపులు నిర్వహించేవారు దరఖాస్తుతో పాటు యజమాని ఆధార్ కార్డును జత చేసి ఇచ్చి అనుమతి పొందాలన్నారు. లేని యెడల మున్సిపల్ యాక్ట్-2019 ట్రేడ్ లైసెన్స్ రూల్స్ ప్రకారం వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

సూర్యాపేట అర్బన్: శాసనసభలో ఆమోదించిన ప్రకారం 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవనంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు అన్ని రంగాలలో 42శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో, శాసనమండలిలో అన్ని పార్టీల మద్దతుతో ఏకగ్రీవ తీర్మానం చేసి 9 జీఓ విడుదల చేసి గవర్నర్‌కు పంపిన బిల్లుని ఆమోదించకుండా బీజేపీ అడ్డుకోవడం దుర్మార్గం అని అన్నారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ అనంతల మల్లేశ్వరి పాల్గొన్నారు.

రూ.2వేల జరిమానా

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని క్వాలిటీ చికెన్ సెంటర్‌ను జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చికెన్ సెంటర్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో చికెన్ షాపు యజమానికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ. 2వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

క్షయ నిర్ధారణ శిబిరం



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో మంగళవారం క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మందికి వైద్య పరీక్షలు జరిపారు. క్షయ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నగేష్‌నాయక్, నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, ఏఎన్ దుర్గమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

ఉత్తమ శాస్త్రవేత్తల జాబితాలో నడిగూడెం వాసి



ఎంఏ జబ్బార్

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన ప్రొఫెసర్ ఎంఏ జబ్బార్‌కు అరుదైన గౌరవం లభించింది. ప్రపంచంలోని ఉత్తమ 2 శాతం ప్రభావశీల శాస్త్రవేత్తల జాబితా- 2025లో ఆయనకు చోటు దక్కింది. ఇటీవల అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఈ జాబితాను విడుదల చేసినట్లు మంగళవారం జబ్బార్ తెలిపారు. వరుసగా ఐదోసారి ఆయన ఈ జాబితాలో నిలవడం విశేషం. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విభాగం అధిపతిగా పనిచేస్తున్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ర్యాలీ

నడిగూడెం : నడిగూడెం మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, ఎక్లాస్‌ఖాన్‌పేట తండా గ్రామాల్లో నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా శిబిరం కొనసాగుతోంది. ఈ సందర్భంగా మంగళవారం సామాజిక అంశాలైన అక్షరాస్యత, మద్యపానం, హరితహారం, బాలకార్మిక వ్యవస్థపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ షేక్ జానిపాషా, కర్నాటి శ్రీధర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సిరెడ్డి, భాస్కర్, ఉపాధ్యాయులు ఉపేందర్, సురేష్, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా గ్రామీణ రోడ్లు



గుంతలు పడి నీళ్లు నిలిచిన చీదెళ్ల-తంగెళ్లగూడెం రహదారి



చెట్లముకుందాపురం-చీదెళ్ల రహదారి దుస్థితి

- అడుగడుగునా గుంతలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చీదెళ్ల నుంచి తంగెళ్లగూడెం, చీదెళ్ల- చెట్లముకుందాపురం, చీదెళ్ల-మాధవరం, చెట్లముకుందాపురం-దూపహాడ్ గ్రామాల రోడ్లు ధ్వంసమయ్యాయి. రోడ్లపై గుంతలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. గుంతల రోడ్లపై ముఖ్యంగా బైక్‌లు, ఆటోలు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంటుందని తెలుపుతున్నారు. మండలంలో అధ్వాన రోడ్ల దుస్థితిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

గుంతలతో ప్రమాదాలు

“ చీదెళ్ల నుంచి తంగెళ్లగూడేనికి వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బీటీ రహదారికి కనీస మరమ్మతులు చేపట్టడంలేదు. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలి.

\- నాగరాజు, తంగెళ్లగూడెం

సమస్య పరిష్కరిస్తాం



“ పెన్‌పహాడ్ మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రహదారులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం.

\- శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ

ఉత్తమ విద్యకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌పవార్

భానుపురి : ప్రభుత్వ రెసిడెన్సియల్, కేజీబీవీ పాఠశాల, కళాశాల్లో చదివే ప్రతి విద్యార్థికి పదవ తరగతి, ఇంటర్‌లో 70 శాతానికి పైగా ప్రతి సబ్జెక్టులో మార్కులు సాధించేలా సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంక్షేమ అధికారులు, విద్యాశాఖ, కేజీబీవీ ప్రత్యేక అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెసిడెన్షియల్, కేజీబీవీ పాఠశాల, కళాశాలలో ఇక నుంచి ఆకస్మిక తనిఖీ చేపట్టినప్పుడు ఎవరైనా విధుల్లో లేకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిబ్బంది సమయపాలన, సిబ్బంది హాజరు, విద్యార్థుల హాజరు వివరాలు ప్రతి రోజూ నివేదిక ఇవ్వాలని సూచించారు. అధికారులు పాఠశాలలకు వచ్చే గుడ్లు, పాలు, చికెన్, వంట సామగ్రి సమయానికి చేరిందా లేదా తెలుసుకోవాలని, భోజనం ఎలా ఉంటుందో పరిశీలించాలని, అలాగే కాంట్రాక్టర్ నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి హెల్త్ ప్రొఫైల్ కార్డు తయారు చేసేలా చూడాలని స్పష్టం చేశారు. కేజీబీవీల్లో ఎక్కడైనా అవసరం ఉంటే తాగునీరు, టాయిలెట్స్, ట్యాప్స్, సీలింగ్ ఫ్యాన్స్, లైట్స్ లాంటి వాటికి మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికారులు శంకర్, దయానంద రాణి, నరసింహారావు, శ్రీనివాస్ నాయక్, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీఈఓ అశోక్, అధికారులు పూలన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

అర్వపల్లి : అర్వపల్లి గ్రామ పంచాయతీ ఆవాసం సీతారాంపురంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్లకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం భూమిపూజ చేశారు. ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్వపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు మేకల రాంబాబు, పంచాయతీ కార్యదర్శి నవీన్‌రెడ్డి, పాల్వాయి లింగమల్లు, సంతు, నవీన్, ప్రవీణ్, నరేష్, తిరుపతి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



నూతనకల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిల్పకుంట్ల రైతులు

నూతనకల్ : నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్లలో దొడ్డు రకం ధాన్యానికి సంబంధించిన కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావుకు గ్రామ రైతులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. గ్రామంలో రైతులు దొడ్డు, సన్న రకాలను సాగు చేశారని తెలిపారు. అయితే అధికారులు కేవలం సన్నరకం వడ్లను కొనుగోలు చేయడానికే ఏర్పాట్లు చేస్తున్నారని, దొడ్డు రకం వడ్ల కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కందాల శంకర్‌రెడ్డి, తొట్ల హరీష్, జటంగి సతీష్, కూసు రామచంద్రు, పులుసు జనార్దన్, ఉప్పునూతల మారయ్య, వెంకన్న, సత్యం, మల్లయ్య, గునగంటి వెంకన్న, జటంగి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు పర్యవేక్షణ బాధ్యతలపై హర్షం

సూర్యాపేటటౌన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలకు అప్పగిస్తూ జీఓ 70ను విడుదల చేయడం హర్షణీయమని ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీవీ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొంతకాలంగా ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు చేసిన పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించినట్లు గుర్తు చేశారు. గత 20 సంవత్సరాలుగా అనుభవం కలిగిన ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం, ఎస్‌జీటీలకు ఈ బాధ్యతలను అప్పగించడం అభినందనీయమని పేర్కొన్నారు.

జీతాలు విడుదల చేయాలి

మద్దిరాల : మండలంలోని పాఠశాలలను శుభ్రంగా ఉంచడానికి ప్రభుత్వం నియమించిన సర్వీస్ పర్సన్స్‌కు గత 5నెలలుగా జీతాలు రావడంలేదని, వెంటనే వారి జీతాలను విడుదల చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రేపాక లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నందున వారికి ప్రతి నెలా జీతం సకాలంలో అందేలా చూడాలని కోరారు. నెల నెలా జీతాలు అందకపోవడంతో వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వేణారెడ్డి

చివ్వెంల : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్, వాల్యతండా, రోళ్లబండ తండా, ఐలాపురం, గుర్రంతండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కేంద్రాలకు ఆరబెట్టిన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని అన్నారు. రైతులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావతు వీరన్న నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేములపల్లి వాసుదేవరావు, తహసీల్దార్ చంద్రశేఖర్, ఏపీఎం వెంకటయ్య, సీసీలు చందు, సైదులు, వీబీకేలు మల్లిశ్వరి, శిరీష, సంఘ బంధం అధ్యక్షురాలు బయ్య పద్మ, గోగుల సుధ, నాయకులు నంద్యాల సోమిరెడ్డి, నరేష్ రెడ్డి, చింతమల్ల రమేష్, గోగుల ఈదయ్య, కొండ వెంకన్న, గోగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆఫీసుల్లో టాయిలెట్స్ నిర్మించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక తదితరులు

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ ఆఫీసుల్లో మహిళలకు టాయిలెట్స్, వాష్ రూమ్స్ ఏర్పాటు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ రావుకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో టాయిలెట్స్, వాష్ రూమ్స్ లేకపోవడంతో ఆఫీసులకు వచ్చే మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆఫీసుల్లోనే మహిళలకు కావలసిన అత్యవసరమైన సౌకర్యాలు లేకపోవడం విచారకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు చంద్రకళ, ఉపాధ్యక్షులు సూరం రేణుక, జిల్లా నాయకురాలు ఐతరాజు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి గాలికుంటు నివారణ టీకాలు

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి వేణుగోపాల్‌రావు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పశు పోషకులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 15, 16న కందగట్ల, కోటపహాడ్, 17, 18న మంగళితండా, పీపానాయక్‌తండా, 22న గట్టికల్, పస్లాతండా, 23న పాతర్లపహాడ్, శెట్టిగూడెం, 24న బోరింగ్‌తండా, తుమ్మలపెన్‌పహాడ్, 26న ఇస్తాళపురం, కాశీగూడెం, 27, 28న నెమ్మికల్, రామన్నగూడెం, 30న పాతసూర్యాపేట, ఏపూరు తండా, నవంబర్ 1న కోటినాయక్‌తండా, ఏపూరు, 3న ఏనుబాముల, మిడ్తనపల్లి, 4న దాచారం, ముక్కుడుదేవులపల్లి, 6, 7న రామోజీతండా, బొప్పారం, 10, 11న ఆత్మకూర్ (ఎస్), మక్తాకొత్తగూడెం, 12న దుబ్బతండా, 13, 14న మిగిలిన గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాలు వేస్తామని తెలిపారు.

తుంగతుర్తి: మండలంలోని గ్రామాలలో బుధవారం నుంచి నవంబర్ 14 వరకు పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు ఇవ్వనున్నట్లు పశు వైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ రవి ప్రసాద్ తెలిపారు. ఈ నెల 15 నుంచి 21 వరకు వెలుగుపల్లి, వెంపటి, 22 నుంచి 24 వరకు అన్నారం, గొట్టిపర్తి, 25 నుంచి 29 వరకు సంగెం, రావులపల్లి, 30 నుంచి 31 వరకు కొత్తగూడెం, తూర్పుగూడెం, నవంబర్ 1 నుంచి 3 వరకు కరివిరాల, మానాపురం, 4 నుంచి 6 వరకు తుంగతుర్తి, 7 నుంచి 8 వరకు కేశవపురం, మంచ్యతండా, సూర్యతండా, 10 నుంచి 12 వరకు గానుగబండ, బండరామారం గ్రామాల్లో ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయనతోపాటు పశువైద్యాధికారి నరేష్, గోపాలమిత్ర శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సీపీఆర్ విధానంపై విద్యార్థులకు అవగాహన



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నగేష్



నాగారం : పసునూర్ మోడల్‌స్కూల్‌లో..

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం సీపీఆర్‌పై విద్యార్థులకు మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ అవగాహన కల్పించారు. గుండె ఆగిపోయిన వ్యక్తికి వెంటనే సీపీఆర్ చేస్తే బతికించవచ్చని చెప్పారు. సీపీఆర్ చేసే విధానంపై వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లలిత, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రెడ్డబోయిన సైదులు, డాక్టర్ ఉదయ్, ఏఎన్‌ఎంలు సైదమ్మ, శకుంతల, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగారం : ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ బొమ్మగాని హర్షవర్ధన్ అన్నారు. నాగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం పసునూర్ మోడల్‌స్కూల్‌లో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి బిచ్చునాయక్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాలరాజు, వైద్యసిబ్బంది అరుణ కుమారి, లక్ష్మీబాయి, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ రెండో దశకు బీఎన్ పేరు పెట్టాలి



పెన్‌పహాడ్ : నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



నూతనకల్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : శ్రీరాంసాగర్ రెండో దశ కాల్వకు మాజీ ఎంపీ భీమిరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని కోరుతూ భక్తాళాపురం గ్రామ పరిధిలోని శ్రీరాంసాగర్ స్టేజ్ - 2 కాల్వ వద్ద సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, ఇరుగు రమేష్, మండల కమిటీ సభ్యులు నెమ్మాది అడివయ్య, పీరయ్య, మచ్చ లింగయ్య, గోపాల్‌దాసు వెంకన్న, శ్రీరాములు, కిరణ్, హుస్సేన్, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : శ్రీరాంసాగర్ రెండో దశకు మాజీ ఎంపీ భీమిరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని పూలే-అంబేద్కర్ ఆశయ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య కోరారు. మంగళవారం అర్వపల్లిలో పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రెండోదశ కోసం బీఎన్ ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. ఎస్సారెస్పీ రెండో దశకు ఆర్డీఆర్ పేరు పెట్టడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నక్కల సురేందర్, నర్సింహ, కృష్ణయ్య, వెంకటమ్మ, సైదులు, నాగరాజు, ఉప్పలయ్య, లింగయ్య, రమణ పాల్గొన్నారు.

నూతనకల్ : శ్రీరాంసాగర్ రెండో దశకు మాజీ ఎంపీ, సాయుధ రైతాంగ పోరాట యోధుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి మాట్లాడారు. శ్రీరాంసాగర్ రెండో దశ నిర్మాణం చేపట్టి సూర్యాపేట, తుంగతుర్తి ప్రాంతాల ప్రజలకు సాగునీటిని అందించాలని వామపక్షాల ఆధ్వర్యంలో ఎన్నోసార్లు ఆందోళనలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, జటంగి లింగయ్య, కూసు వెంకన్న, జనార్దన్, లింగయ్య, రామచంద్రయ్య, మల్లయ్య, బాణాల విజయ్‌కృష్ణారెడ్డి, మహేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : శ్రీరాంసాగర్ జలాల కోసం ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసిన మాజీ పార్లమెంట్ సభ్యుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి (బీఎన్) పేరును ఎస్సారెస్పీ ఫేజ్-2కు పెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడియం కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు, తుంగతుర్తి ప్రాంతానికి గోదావరి జలాలు తేవడమే తన జీవిత లక్ష్యంగా బీఎన్ ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. ఎస్సారెస్పీ ఫేజ్-2కు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరు పెట్టడం సమంజసం కాదని, ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరారు. ఆయనతో పాటు సీపీఎం నాయకులు గుడిపూడి వెంకటేశ్వర్లు, కండె భిక్షం, మల్లయ్య, మహేందర్, పిచ్చమ్మ, నారాయణ, దేవరకొండ వెంకన్న, పద్మ, స్వరూప ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



పెన్‌పహాడ్ : మాచారం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ, పోలీస్ సిబ్బంది



మద్దిరాల : కుంటపల్లిలో..

మద్దిరాల : ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే వదిలి పెట్టేది లేదని ఎస్ఐ వీరన్న అన్నారు. ఎస్పీ ఆదేశానుసారం మంగళవారం కుంటపల్లిలో నాకా బందీ నిర్వహించి వాహనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : అనుమానితులపై పటిష్ట నిఘా ఉంచి తనిఖీలు చేస్తున్నామని ఎస్ఐ గోపికృష్ణ అన్నారు. ఎస్పీ ఆదేశానుసారం మంగళవారం మండల పరిధిలోని మాచారం వద్ద పోలీసు నాకా బందీ కార్యక్రమం నిర్వహించారు. పకడ్బందీగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాములు, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులపై పటిష్ట నిఘా..

తుంగతుర్తి : తుంగతుర్తి సర్కిల్‌లోని పసునూరు శివారులో మంగళవారం పోలీసులు నాకా బందీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు, రక్షణ కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు అర్వపల్లిలోని వైజంక్షన్‌లో మంగళవారం రాత్రి పోలీసులు నాకా బందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఈట సైదులు, ఏఎస్ఐలు రామకోటి, మేకల రాములు, పోలీసులు పాల్గొన్నారు.

నూతనకల్ : గ్రామాల్లో అనుమానితుల కదలికల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నాగరాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బిక్కుమళ్ల వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశానుసారం నాకా బందీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



తుంగతుర్తి : పసునూరు శివారులో..



అర్వపల్లిలోని వైజంక్షన్‌లో..



నూతనకల్ : బిక్కుమళ్లలో..

బంద్‌ను జయప్రదం చేయాలి

సూర్యాపేటటౌన్ : జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ నెల 18న తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని జాతీయ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నేత వీరబోయిన లింగయ్య యాదవ్ కోరారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రావు విగ్రహం ఎదుట పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. బీసీల హక్కుగా 42శాతం రిజర్వేషన్ల ను పోరాడి తెచ్చుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరాల సాయి, బీసీ యువజన సంఘం నాయకులు ఉప్పల మధుసూదన్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు బయ్యా రాజేష్, అఖిలేష్ యాదవ్, నరేష్, గణేష్, యశ్వంత్, గౌతమ్, వెంకన్న, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సాధ్యంకాని హామీలతో మోసం

నూతనకల్ : ఆచరణకు సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధి కారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకులకు బాకీ కార్డులను చూపించి నిలదీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బత్తుల సాయిలుగౌడ్, చూడి లింగారెడ్డి, గాజుల తిర్మల్ రావు, గాడ్డుల లింగరాజు, బత్తుల విద్యాసాగర్, వీరుయాదవ్, మొగుళ్ల వెంకన్న, జక్కి పరమేష్, కప్పల రామ్మూర్తి, కనకటి మహేష్ పాల్గొన్నారు.

వానొస్తే ప్రయాణం కష్టమే..



సంగెం గ్రామ రహదారిపై ప్రవహిస్తున్న వాగు వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు(ఫైల్)

- వర్షాలకు సంగెం గ్రామ రోడ్లు తెగి రాకపోకలకు ఇబ్బందులు
- వరద తగ్గే వరకూ విద్యార్థులు స్కూళ్లకు వెళ్లలేని పరిస్థితి
- సమస్య పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వేడుకోలు



సంగెం గ్రామం నుంచి వెంకేపల్లి వెళ్లే రహదారి తెగి ప్రవహిస్తున్న నీరు

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిధిలోని సంగెం గ్రామ విద్యార్థులకు వర్షం వస్తే పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. ఆగస్టులో కురిసిన వర్షాలకు గ్రామ రోడ్డుపై నుంచి రుద్రమ చెరువు అలుగు ప్రవహించి రహదారి పూర్తిగా కొట్టుకపోయింది. అలాగే సంగెం నుంచి వెంకేపల్లి వెళ్లే మార్గంలో సంగెం చెరువు అలుగు కారణంగా అక్కడ కూడా రోడ్డు తెగిపోయి రాకపోకలు నిలిచాయి. దీంతో గ్రామస్తులు సంగెం నుంచి వెంకేపల్లికి వెళ్లే దారిని తాత్కాలిక మట్టి పోసి రాకపోకలు సాగిస్తున్నారు. కానీ ఆదివారం కురిసిన భారీ వర్షానికి సంగెం చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించడంతో పోసిన మట్టి మళ్లీ కొట్టుకుపోయింది. దీంతో దీంతో వెంకేపల్లి, నూతనకల్ పాఠశాలలకు వెళ్లే 40 మంది విద్యార్థులు ఇంటి దగ్గరే ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది. కొంతమంది విద్యార్థులు గతంలో వాగు వద్ద నిలబడి నిరసన కూడా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు వీలుగా తాత్కాలిక ఏర్పాట్లు చేసి, ప్రయాణ సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.